# డాటర్స్ ఆఫ్ ఇండియా

ఎర్రగా కందిపోయిన మొహం రుమాలుతో తుడుచుకుంటూ గది బయటికి వచ్చింది వసంత. గదిలో ఫ్యాన్ తిరుగుతూనే వుండి వుంటుంది. కానీ ఆమెకి విపరీతంగా చెమట పట్టింది. బయటికి రాగానే చల్లని గాలి చెంపలకి తగిలి ప్రాణం హాయిగా వున్నట్లనిపించింది.

ఎండ ఎర్రగా ఆమె ముఖం కన్న ఎర్రగా- కోపంగా- ఆమెకన్న కోపంగా మండిపడుతోంది. వసంత కాలేజీ గేటు దాటి బస్‌స్టాప్ దగ్గర నిలబడింది. రెండు గంటల క్రితం ఇంటిదగ్గర బయలుదేరినప్పుడు కొండంత ఉత్సాహం, తనకే కాదు అమ్మకీ నాన్నకీ కూడా.

డిగ్రీ అందుకున్నాక ఎన్ని ఇంటర్వ్యూలు - అమ్మాయికేం ఫస్టు క్లాసు- హై ఫస్టుక్లాసు- యూనివర్శిటీ సెకండ్.

"అది నా కూతురే" అంటారు నాన్న. బస్‌స్టాప్ వరకూ వచ్చి దిగబెట్టేరు ఆయన. ఆయన కళ్ళు వెలిగిపోయాయి. ఆ ఉత్సాహం, ఆ సంతోషం ఇప్పుడు లేవు.

"తెర తీయగరాదా !" అన్నట్లు తెర తీశారు - షాక్ కొట్టింది - నిజం తెలిసింది- తెరవెనుక వున్న సంగతులన్నీ అర్థం అయ్యాయి.

"టు హెల్ విత్ యువర్ జాబ్—"

అని వాళ్ళు పంపిన కాగితాన్ని స్క్రుక్వ చించి సెక్రటరీ మొహాన వేయాలనిపించింది ఇరవై అయిదేళ్ళ యువతి వసంతకి.

"నీ సంగతంతా పేపరుకి రాసేస్తాను-"

అని గట్టిగా అరవాలనిపించింది పోస్ట్‌గ్రాడ్యుయేట్ వసంతకి.

కానీ వసంత అవేమీ చెయ్యలేదు.

దేనికైనా సెకండ్ థాట్స్ అవసరం అని మామయ్య అంటూ వుండేవాడు. ఆవేశం అనర్థం అని అమ్మ కూడా అంటుంది. అందుకే వసంత తన కోపం, తన రోషం- అన్నీ అణచి పెట్టుకొని "ఒక్కరోజు టైం ఇవ్వండి సార్. రేపు పదిన్నరకల్లా నా నిర్ణయం చెప్పేస్తాను" అని రెండు మాటలు చెప్పి బయటపడింది. బయట పడిందే కానీ ఆమెలో కోపం చల్లారలేదు. అగ్నికి ఆజ్యంలా, కోపానికి ఎండ తోడయింది. బస్సు రావడం లేదు.

"ఎక్స్‌క్యూజ్ మీ—మిస్."

వసంత తలయెత్తింది. ప్రక్కన నిలబడి వున్న అతన్ని ఆమెకి తెలుసు - మొన్న జరిగిన ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళల్లో అతనొకడు. అతనికే తప్పకుండా ఈ ఉద్యోగం వస్తుందని అక్కడందరూ అనుకున్నారు.

"మీతో కొంచెం మాట్లాడదామని."

అతను వినయంగా నిలబడ్డాడు.

"కానివ్వండి" అంది ముభావంగా.

"ఇప్పుడు జరిగిందంతా నాకు తెలిసింది. ప్యానెల్‌లో నా పేరు రెండవది, మీరీ ఉద్యోగం అక్కర్లేదనుకుంటే నాకు వస్తుంది

మీరు ఏ నిర్ణయం తీసుకున్నారో చెబితే—"

వసంత అతని వంక చూసింది. ట్రిమ్‌గా వున్నాడు. ఖరీదైన బట్టలు ఇంపోర్టెడ్ రిస్టువాచి. ఒక వేలికి వెంకటేశ్వరస్వామి ఉంగరం. ఎత్తుమడమల బూట్లు.

"నేనింకా ఏం నిర్ణయించుకోలేదు. పెద్దవాళ్ళతో మాట్లాడాలి." అంది వసంత.

"ఓ మాటటాంటాను కోపం తెచ్చుకోకండి-" అన్నాడతను,

"అనండి."

"పదివేలు ఉద్యోగానికి కట్టి, మళ్ళీ పెళ్లికి ఇంకా కొంచెం కట్నం ఇచ్చుకునే స్టేటస్ మీకు వుంటే సరే. లేకపోతే అనవసరం. ఎందుకంటే యిలాంటి కాలేజీల్లో జీతాలు సరిగ్గా యివ్వరు. సంతకాలు పెట్టించుకునే దానిలో మూడోవంతు యిచ్చినా ఎక్కువ్వే. పైగా పెళ్ళిచేసుకోడం తప్పదు. పెళ్ళయినాక మీ భర్తకి ఎక్కడ ఉద్యోగం అయితే అక్కడికి వెళ్ళక తప్పదు. కట్టినపదివేలూ నష్టమే. మీలాంటి తెలివిగలవాళ్ళు పనిచెయ్యతగ్గ కాలేజీ కాదేమో ఇది."

వసంతకి వొళ్లు మండింది.

"ఈ కష్టాలన్నీ మీకూ వుంటాయిగా!" అంది.

అతను నవ్వేడు-"నేను పదివేలు కడితే నాకు ముప్ఫైవేలు కట్నం వస్తుంది. రెండు మూడేళ్ళు తక్కువ జీతానికి పనిచేసినా, ఆపైన గ్రాంట్ వచ్చాక నిండుజీతం అదే వస్తుంది. ఈలోగా ట్యూషన్లు చెబుతాను. ఈ ప్రపంచంలో మొగవాడికేం కష్టం. మేడమ్!" అతని కళ్ళల్లో గర్వం చూస్తే అసహ్యం వేసింది వసంతకి.

బస్సొస్తోంది.

"ఆలోచించుకొండి మేడమ్. మీరు చేరకపోతే పదిహేను వేలు

యినా యిస్తానని నేను సెక్రటరీకి కబురు చేశాను. అసలు నేనే సెలెక్ట్ కావాల్సింది. కమిటీ మాట వినకుండా తక్కిన మెంబర్స్ మీకు మార్కులు వేసి వుంటారు." బస్సు వచ్చింది-

అతను వెళ్లిపోయేడు.

"ఆర్డర్ తెచ్చుకున్నావా? ఎప్పుడు చేరమన్నారూ! అలా వున్నావేం? ఎండకి మొహం కందిపోయిందమ్మా-రోజూ ఎలా వెళ్ళొస్తావో ఏమో-" అమ్మ గుమ్మంలోనే—వసంతకి ఏడవాలనిపించింది. అమ్మ పెట్టిన అన్నం కూడా సహించింది కాదు.

నాన్న భోజనానికి వచ్చారు.

ఆయన అడిగారు.

తను చెప్పింది. అమ్మ నిర్ఘాంత పోయింది గాని ఆయన నవ్వారు.

"అలాగా!" అన్నారు.

"బాగానే వుంది. మనకేం వద్దులే ఇంతోటి ఉద్యోగం దొరక్క-పోతోందిటా! ఎం.ఏ, చదివి లెక్చరర్ పనిచేస్తే ఇచ్చేది నాలుగు వందలా? ఇంటరు చదివిన మా తమ్ముడికే ఎనిమిది వందలొస్తున్నాయి. దానికితోడు పదివేలు లంచమా! ఎవడన్నా వింటే నవ్విపోతాడు గానీ ఇక ఆ గుమ్మం తొక్కకు." అంది అమ్మ.

వసంతకి ఇది ఇది అయిదో ఇంటర్వ్యూ. ఆమె ఎకనమిక్సులో డిగ్రీ తీసుకుని మూడేళ్ళు కావస్తోంది. ప్రతిచోటా ఇంటర్వ్యూలు బాగానే చేసింది. ఎక్కడా సెలెక్షన్ రాలేదు. ఈ మూడేళ్ళుగా ఆమెకి చాలా పెళ్లిసంబంధాలు కూడా వచ్చాయి. ఏదీ కుదరలేదు. వసంతకేం తక్కువ? తల్లిలా పచ్చగా వుంటుంది. తండ్రిలా తెలివిగా వుంటుంది. ఉద్యోగం రాలేదని వసంతకి బాధగా వుంటే, పెళ్ళి సంబంధం కుదరలేదని తల్లికి బాధగా వుంది. సరిగ్గా అలాంటప్పుడే ఇక్కడ సెలెక్షన్ వచ్చింది.

వచ్చింది కదా అని పుట్టెడు సంతోషంతో వెడితే చావు కబురు చల్లగా చెవిన వేసేడు కమిటీ సెక్రెటరీ.

"మా కాలేజీకి ఫండ్స్ లేవు. కట్టే బిల్డింగ్ సగంలో ఆగిపోయింది. అందుచేత" అని అక్కడ ఆగి, సిగరెట్ వెలిగించాడు.

"మీ నాన్నగారేం చేస్తారు? అన్నాడు.

వసంత చెప్పింది, "ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యేరు" అని.

"మేం స్కేల్ యిస్తాం అని పేపర్లో వేసేం కానీ ఇవ్వలేం అమ్మాయి! ఎందుకంటే ఫండ్స్ లేవు—అవునా?" అని కళ్ళజోడులోనుంచీ చూసేడు. అవునో కాదో తనకేం తెలుసు.

"మేం మొదట్లో అందరికీ మూడొందలే యిచ్చాం. నీకు నాలుగు వందలు యిస్తాం. సంతకం మాత్రం నిండు జీతానికి పెట్టాలి. సణక్కూడదు మరి. ఎలాగూ ఓ ఏడాదిలో ఎయిడ్ వస్తుంది నీ పోస్టుకి. అప్పుడు నీకు జీతం పువ్వుల్లో పెట్టి అప్పజెప్పేస్తాం. అవునా?"

వసంత మొహం ఎర్రబడింది.

"నీ పోస్టుయిస్తే ఇరవై వేలిస్తాం అని తిరిగారు. కనీసం ఓ పది వేలైనా నువ్వు యిస్తే...."

వసంత చివ్వున తల ఎత్తింది. అయినా ఏమీ అనలేదు.

ఇలాంటి సంగతులు తన స్నేహితులు చెప్పిన వెన్నో ఆమెకి గుర్తున్నాయి.

ఇలాంటివి వినడం క్రొత్త కాదు.

సెక్రెటరీ బజ్జర్ నొక్కాడు. ఎటెండర్‌ని కాఫీ తెమ్మన్నాడు.

"ఇలా అడగడం నాకూ యిష్టం లేదు. కానీ తప్పదు మరి. కాలేజీ అభివృద్ధి కోసం."

కాఫీసుద్దిలా వుంగి. జిడ్డుగా కూడా వుంది. చేదుగా, అసహ్యంగా వుంది.

భోజనాలయేయి. అమ్మ సణుగుతూ కాలేజీల వాళ్ళని తిడుతూ మధ్యాహ్నం నిద్రకి వొరిగింది.

నాన్న పడక కుర్చీకి చేరబడి సిగరెట్ వెలిగించారు. ట్యూషన్లూ, ఆశ్రిత జన పక్షపాతాలు—మార్కుల తికమకలు....ఇలాంటివి ఎరుగకుండా రిటైరైన మనిషి ఆయన!

"ఏమిటాలోచిందావమ్మా!" అన్నాడాయన.

"మీరేం చెయ్యమంటారో చెప్పండి." అంది.

అమ్మకి నిద్రాభంగం అయినట్లుంది, లేచి వచ్చింది.

"ఏమిటి చెప్పేది! నా తలరాత! యూనివర్సిటీ హాస్టల్‌లో వుండి చదివితే నెలకింత అని ఎంత ఖర్చయిందో తెలుసా! అప్లికేషన్లకి ఇంటర్వ్యూలకి ఎంత ఖర్చు అవుతోంది! ఇదంతా సరే—పదివేలు కట్టి చేరతావు వాళ్ళిస్తే ముష్టి నాలుగు వందలకి—రేపు పెళ్ళయి వెళ్ళిపోతే పదివేలూ దండగే కదా! ఆలోచన వుండొద్దూ-"

వసంతకి వెంకటేశ్వరస్వామి వుంగరం. ఇంపోర్టెడ్ క్రిస్టల్ వాచీ అతను గుర్తొచ్చేడు.

ఒకతరం వెనక పుట్టిన అమ్మలాగే అతనూ ఖచ్చితంగా ఇలాగే మాట్లాడేడు.

అమ్మ అంతటితో ఆగలేదు.

"పెళ్ళి అంటూ అయితే ముప్ఫైవేలు ఖర్చవుతాయి. అంతా నీకే ఖర్చుపెడితే రేపు మురళి చదువుకి ఏం వుంటుంది!" నాన్న రిటైరైనాక ఎలాగో తంటాలు పడి ఈ ఇల్లొకటి కట్టేరు. అంతకన్న తమ దగ్గర ఏం లేదు. అలమారల నిండా. గూళ్ళ నిండా, కిటికీల నిండా పనికి రానన్ని పుస్తకాల గుట్టలు తప్ప!

మురళి అంటే వసంత తమ్ముడు.

ఆడపిల్లకి ఇంత ఖర్చుచేస్తే వాడికి మాత్రం మంచి చదువు చెప్పించక్కర్లేదూ! వాడికి మాత్రం ఉద్యోగానికి ఖర్చు పెట్టక్కర్లేదూ! ఆడపిల్లకి పెళ్ళి కాగానే మొగుడి వెంట వెళ్ళిపోతుంది, అమ్మకీ నాన్నకీ సుస్తీ చేసినా ఆతగాడి పర్మిషన్‌తో గానీ రావడానికి వీల్లేదు. అదే మగవాడైతే తల్లి, తండ్రుల దగ్గరే వుంటాడు మంచీ చెడూ చూస్తాడు. ఇది తల్లి అభిప్రాయం.

కట్నాల పెళ్ళిళ్ళమీదా, డొనేషన్ చదువులమీదా, లంచాలిచ్చి తెచ్చుకునే ఉద్యోగాల మీదా మొన్నటి వరకూ తీవ్రమైన విమర్శలు చేసిన వసంత ఏమి మాట్లాడంలేదు.

తండ్రి తన అభిప్రాయం చెప్పలేదు—

"రేపటి వరకూ టైం అడిగాను నాన్నా" అంది వసంత.

"ఇంకా టైమూలేదూ, నీ తలకాయాలేదు. నేను రానని చెప్పెయ్. ఏ మగవాడికైనా వస్తుంది. నీ పుణ్యమా అని. ఉద్యోగాలు లేక మొగవాళ్ల నానా అవస్థా పడుతున్నాడు." అంది అమ్మ.

అవును చాలా అవస్థపడుతున్నారు. కాని. వాళ్ళ దగ్గర పాట పెంచే స్తోమతు ఏదీ! పాట పెంచే శక్తి అతని దగ్గర వుంది. క్వార్ట్జ్ క్రిస్టల్ వాచీ. వెంకటేశ్వరస్వామి వుంగరం అతని దగ్గర వున్నాయి. అతనికి ఎంత డొనేషన్ కడితే అంత కట్నం వస్తుంది. సెకెండ్‌క్లాస్‌తో లెక్చరర్ అయిపోతాడు. ప్రొద్దున, సాయంత్రం తలా రెండు బ్యాచీలకి ట్యూషన్ చెబుతాడు. ఐదేళ్ళకి ఇల్లు కట్టేస్తాడు.

పెంచలేనివాడు ఇలా ఇంటర్వ్యూలకి తిరుగుతూనే వుంటాడు. టెంపరరీ పోస్టులు చేస్తూనే వుంటాడు. ఎప్పుడో అదృష్టం బాగుంటే, వారికి రికమండేషన్ క్యాండిడేట్ లేకుంటే ఇతనికిస్తారు.

వసంతకి తల తిరుగుతోంది.

స్కూటర్ మీద ఇంటర్వ్యూకి వచ్చిన అతనికి ఆ ఉద్యోగం తప్పకుండా వస్తుంది తను కాదంటే! తనకింక ఎక్కడా రాదా? ఎకనామిక్సుకి ఎంత పోటీనో! ఒక్కో ఇంటర్వ్యూకి సలభై, ఏభై మందికి తక్కువ రారు. తనని పొరుగూరు పంపరు. ఒక్కటినీ వుండనీయరు. వున్న వూళ్ళో వుద్యోగం.

వసంత ఆలోచిస్తూనే వుంది.

"ఏం చెయ్యను నాన్నా?" అంది.

ఆయన కూతురు వంక చూసేరు.

"నీ కన్నీ తెలుసునని నేను అనుకుంటున్నానమ్మా. నా దగ్గర ప్రస్తుతం ఇరవై వేలకన్నా లేవు. మీ అమ్మేమో నీ పెళ్ళికి తొందపడుతోంది కదా! నువ్వే ఆలోచించి ఓ నిర్ణయానికి రా అమ్మా. నువ్వేది అడిగితే నేను కాదన్నాను కనుక!" అన్నాడు ఆయన.

వసంతకి ఆయన చెప్పింది అర్థం అయింది. "అమ్మాయ్! మన శక్తి ఇంతే– ఇందులో నువ్వు ఉద్యోగం కొనుక్కుంటావో! మొగుణ్ణి కొనుక్కుంటావో తేల్చుకో!" అని!

తన క్లాసుమేట్సు ఇద్దరు ఎం. ఎ. ప్యాసయి కాన్వెంటుస్కూళ్ళల్లో చెరో మూడు వందలకి ఉద్యోగాలు చేస్తున్నారు. బి.ఇడి. లేదని వాళ్ళని చిన్న క్లాసులకి చెప్పిస్తున్నారు.

"ఆ ఏదో కాలక్షేపం లెద్దూ, మరీ ఇంతవాళ్ళం అయి. తల పిన్నులకీ, సినిమాలకి నాన్నలని డబ్బేం అడుగుతాం." అంటారు వాళ్ళు.

పెద్దయినాక చాలా ఖర్చులు, బాడీలు. లంగాలు, తిలకం సీసాలు,

ఎప్పుడైనా సినిమాలు, పది చీరెలు. ఇవన్నీ అసలే పాతికేళ్ళున్న ఆడపిల్ల ఇంకా ఇండియాలో తల్లిదండ్రుల గుండెలమీద కుంపటే. ఆ కుంపటి మీద ఇంత ఖర్చు పెట్టాలంటే పాపం వాళ్ళకి కష్టమే. ఎ.బి.సి;డి,లు నేర్పుతూ ఆడుతూ పాడుతూ పైఖర్చులకిసంపాదించవచ్చు. ఇరపై నాలుగు గంటలూ ఇంట్లోవుంటే పనికి పనీ, పెళ్ళికాదని పదిమందికి పుట్టే దిగుల్లో తామూ భాగం పంచుతోవలసి రావడం వగైరాలన్నీ వుంటాయి.

తనకీ వచ్చింది ఒక స్కూల్లో ఉద్యోగం. వసంత చేరలేదు. అతను చెప్పినట్లు ఓ ఏడాది కష్టపడితే తనకి స్కేలు యిస్తారు. ఓచోట పోస్టింగ్ వుంటుంది. వసంతకి ఆశ్చర్యంగా వుంది. ప్రొద్దున సెక్రటరీ గదిలో ఆమెకి వొచ్చిన కోపం కరిగిపోతోందా? తను మారిపోతోందా?

వసంత పెళ్ళి గురించి ఆలోచించింది.

ఇంటర్వ్యూలు, పెళ్ళి చూపులూ.

రెండూ రెండే–ఎంత టెన్షన్—

ఇంటర్వ్యూనే నయం పెళ్ళి చూపుల కన్న.

"మొగుణ్ణి కొంటావా, ఉద్యోగం కొంటావా?" వసంతకి కడుపులో దేవి నట్లయింది. వాంతి వచ్చేలా అనిపించింది.

స్కూటర్ మీద ఇంటర్వ్యూకి వచ్చిన ఇంపోర్టెడ్ వాచీ. వెంకటేశ్వరస్వామి వుంగరం అతను జ్ఞాపకం వచ్చాడు అతను కట్టబోయే ఇల్లు. పెట్టబోయే ఫైనాన్స్ కంపెనీ, కొనబోయేకారుగుర్తొచ్చాయి.

తను పెళ్ళి చేసుకుంటే ఎప్పుడో ఇరవై వేలల్లో పెళ్ళికొడుకు గారికి, అతని అమ్మకినచ్చి. తనకివాళ్ళు నచ్చి ఇంకా ఎన్నేళ్ళకో అప్పుడు తను అతని వెంట ఎక్కడికో వెళ్ళిపోతే. అక్కడ తనకి ఉద్యోగం రాకపోతే. అతన్ని కనిపెట్టుకొని వుండి. ఇల్లూ వాకిలిచూసి, అమ్మనినాన్నని

చూడాలనుందండీ· మా వూరు వెళ్ళాలి కొంచెం డబ్బు కావాలి." అని అడిగి, మొన్నేగా వెళ్ళావు? రానూపోనూ బోలెడు ఖర్చు" అనిపించు కొని—ఏదీ పెళ్ళి కొడుకు? తనకి నచ్చినవాడు? వెతకాలి.` ఎన్నాళ్ళు? "ఎవరో ఒకరు. ఇకనైె వేలకి దొరికే వాళ్ళు." ఇది అమ్మ ఆలోచన!

పెళ్ళి కొడుకుల ఖరీదులు విపరీతంగా పెరిగిపోయిన ఈ రోజుల్లో. మనం పెట్టే ఖరీదుకూ. మనం ఆశించే సరుకుకూ సామ్యం ఎలా కుదురు తుంది! ఈ లోగా ఉద్యోగాల రేట్లు పదింతలు పెరుగుతాయి. కాదు పెంచే స్తారు. వాళ్ళకేం ఇక్కడ పాట పెంచుతారు· అక్కడ కట్నం పెంచు తారు!

"ఇంక ఆలోచన మాను వద! కాఫీ పెట్టు." అందిఅమ్మ.

అమ్మవన్నీ ఖచ్చితమైన అభిప్రాయాలు, ఉన్న వూళ్ళో నిండు జీతం మొదటినించీ ఇచ్చే కాలేజీలో ఉద్యోగం రావాలి. తక్కువ కట్నంలో అమ్మాయి కన్నా ఎక్కువ చదువుకున్నవాడూ. బాగుండి మంచి సంప్రదాయం కలవాడు భర్తగా రావాలి.

నాన్న ఏం అనుకుంటున్నారో తెలియలేదు.

వసంత టైం చూసుకుంది. రేపు బ్యాంక్ హాలిడే. అయిదు దాటితె బ్యాంకులో డబ్బివ్వరు. సెక్రెటరీ చెక్ తీసుకోడు క్యాషే కావాలి. ఇప్పుడు ఉద్యోగం కొంటే తరువాత మొగుణ్ణి కొనుక్కోకూడదా! అనుకుంది వసంత. ఆమె మనసు అదే మొగ్గుతోంది-

"ఇప్పటికే పాతికేళ్ళు"-అంటోంది అమ్మ. కాఫీలు అయ్యాయి.

"అమ్మా! నేనివ్వుడే కాత్యాయనితో ఫోన్‌లో మాటాడి వస్తా," అని గబ గబ బయటికి వచ్చింది వసంత.

"ఆదర్శాలు అన్నం పెట్టవ్ అమ్మడూ, జనంతో పాటు మనమూ వెళ్ళాల్సిందే. నీకు కనీసం అలాంటి అవకాశం అయినా వచ్చింది, వేగి

రం చేరిపో, పెళ్ళి అంటావా, దాన్ని వాయిదావెయ్," అంది కాత్యాయని. ఆమె ఇంకా చాలా అన్నది.

"ఈ రోజుల్లో పెళ్ళికొడుకులకి ఉద్యోగం చేసే అమ్మాయేకావాలి. అందుకని కట్నంలో కొంత తగ్గింపుకూడా నీకు దొరకవచ్చు. అదలా వుండనియ్. అసలీ ప్రపంచానికి ఆధారం రూపాయి నాణెం అని మనం చదువుకున్నాం. గుర్తుందా? నువ్వూ నేనూ తీరని కోరికల్తో దహించుకు పోడంలేదు కదా. అంచేత ముందు ఉద్యోగం కొనుక్కో. మీ నాన్న దగ్గర కనీసం పదివేలైనా వున్నాయి. నువ్వు అదృష్టవంతారాలివి. నువ్వు ఉద్యోగంలో చేరకపోయినా ఆ పదివేలూ కట్నం క్రింద మరోపదివేలతో పాటు వెళ్ళిపోతాయి. నా మాట వినోయ్ వసంతా, కాదనకు. ప్లీజ్. నీ మంచికే."

వసంత నిరాశగా ఫోన్ పెట్టేసి వచ్చింది.

ఇంటికి వచ్చేసరికి నాన్న ఈజీ చెయిర్‌లో సిగరెట్ త్రాగుతూ, అమ్మ చాపమీద కూర్చుని సిగ చుట్టుకుంటూ "ఆ ఇరవైకీ పోనీ ఇంకో అయిదో ఆరో కలిపి వున్నంతలో మంచి సంబంధంకానివ్వండీ. ఇప్పటికే పాతికేళ్ళు" అంటోంది.

వాచి చూసుకుంది వసంత. మూడున్నర.

బీరువా తీసి చెక్ బుక్ తీసింది.

మనిషిని కొనవచ్చు. మనసుల్ని కొనగలమా?

"ఉద్యోగం కొనడమే నయిబేమో మనిషిని కొనడం కన్నా" కాత్యాయని గొంతులో ఆవేదన—

వసంత చెక్‌బుక్‌లో అంకె వేసి తండ్రి దగ్గరకొచ్చి "సంతకం చెయ్యి నాన్నా, టైంలేదు" అన్నది.